క్లుప్తంగా

రాజశేఖరానికి జన్మదిన శుభాకాంక్షలు



రాజశేఖరానికి పుష్పగుచ్ఛం ఇచ్చి బర్త్ డే విషెస్ తెలుపుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

పాలకొండ: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జనవరి 1వ తేదీన ఆయన పుట్టినరోజు సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన ఇంటికి చేరుకుని, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే విషెస్ చెప్పారు. అలాగే ఏపీ ఎన్జీఓ నాయకులు లిల్లీపుష్పనాథం, రంగాచారి, ఈశ్వరరావు కూడా కేక్ కట్ చేసి, రాజశేఖరానికి హ్యాపీ బర్త్ డే తెలిపారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



కురుపాం: నూతన సంవత్సరం-2023 పురస్కరించుకుని, కురుపాం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో పండగ చేసుకోవాలని ఆమె ప్రజలను కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని చినబోగిలి వద్ద శనివారం రైలు ఢీకొని చినబోగిలి గ్రామానికి చెందిన కునుకు సింహాచలం(45) మృతి చెందాడు. ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొనడంతో మరణించినట్లు స్థానికులు చెబుతున్నారు.

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- పాలకొండలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం
- హాజరైన పార్టీ ముఖ్య నేతలు
- వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం
- అందరి కృషితోనే లక్ష్య సాధన సాధ్యమని స్పష్టీకరణ



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

పాలకొండ:

మార్కెట్ యార్డు ఆవరణలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి హాజరైన పార్టీ పార్వతీపురం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, నియోజకవర్గ పరిశీలకుడు డోల జగన్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హాజరై, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని 175 శాసనసభ స్థానాల(టార్గెట్ 175)లకు 175 స్థానాలు గెలవాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు మాట్లాడిన అయా నేతలు మన నియోజకవర్గం గెలుపు నుంచే సీఎం జగనన్న ఆకాంక్ష నెరవాలని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న సుస్థిర పాలన కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అది ఒక్క మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే ఆయనను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీనికోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్నన్ని సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో లేవన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని, ఎంతోమంది నిరుపేదలు సంతోషంగా జీవిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పారదర్శక పాలన అదించేందుకు ఆయన ప్రవేశపెట్టిన గ్రామసచివాలయ, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచిపేరు వచ్చిందని, ఇది చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం చేసే మంచిపనులు వీలైతే మెచ్చుకుని, ప్రజల మన్ననలు, ఆశీస్సులు పొందాలని హితవు పలికారు. అంతకుముందు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో సంతోషం: ఎమ్మెల్యే కళావతి



ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తాము వెళ్తున్నప్పుడు ప్రతీ గడప(ఇల్లు)లోని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమం ద్వారా ఎన్నో సమస్యలు పరిష్కారం చేయడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోంది. సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అందరికీ లబ్ధి జరుగుతోంది. ప్రతీ పేదవాడు కడుపునిండా భోజనం చేస్తున్నాడన్నా, ఓ మంచి ఇంట్లో ఉంటున్నాడన్నా అది సీఎం జగనన్న దయే. ప్రజల బాగోగులే లక్ష్యంగా సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నికల మేనిఫెస్టోలోని 98 శాతం హామీలు అమలు చేసిన ఘనత ఒక్క వైఎస్సార్ సీపీదే. ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, మరోసారి సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి.

తప్పుడు ఆరోపణలు తగదు: ఎమ్మెల్సీ విక్రాంత్



ప్రభుత్వంపై ఎల్లోమీడియా, ప్రతిపక్షాలు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రజలకు ప్రభుత్వం మేలు చేస్తుంటే టీడీపీ నాయకులు తట్టుకోలేకపోతున్నారు. అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తున్న ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం తగదు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వివరించాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లపై ఉంది. టీడీపీ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి, లేకపోతే ప్రజలే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారు.

సమన్వయంతో పనిచేద్దాం: నియోజకవర్గ పరిశీలకుడు డోల జగన్



పార్టీ గెలుపే ప్రధానంగా మనమంతా సమన్వయంతో పనిచేద్దాం. అందరి కృషితోనే సీఎం జగనన్న ఆకాంక్ష అయిన 175 శాసనసనభ స్థానాల్లో గెలుపు సాధ్యం. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలంతా అహర్నిశలు కష్టపడాలి.
మరోసారి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు సైనికుల్లా పనిచేయాలి. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ. ఇదే ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తేవాలి.



సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

ఏపీ ఎన్‌జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ



పాలకొండ రూరల్: ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్



పాలకొండ: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్



వీరఘట్టం: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ కృష్ణమూర్తి



భామిని: యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ ప్రకాశరావులు

పాలకొండ: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏపీ ఎన్‌జీఓ, ఏపీటీఎఫ్ క్యాలెండర్-2023లను సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ పాలకొండ శాఖ నాయకులు లిల్లీపుష్పనాథం, రంగాచారి పాల్గొన్నారు.
వీరఘట్టం: స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఏపీటీఎఫ్-2023 క్యాలెండర్, డైరీలను ఎంఈఓ పత్రి కృష్ణమూర్తి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఎం.మురళి, ఆర్.ధనుంజయనాయుడు, బి.రామారావు, గౌరీశ్వరరావు, డి.శ్రీనివాసరావు, డి.నాగమణి పాల్గొన్నారు.
భామిని: పట్టణంలో యూటీఎఫ్-2023 క్యాలెండర్, డైరీలను ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

సాలూరు: మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా శనివారం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు స్థానిక సమస్యలపై, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. అజెండాలో అంశాలను ఆమోదించారు. ఈ క్రమంలో పెద్దబజార్లో శిథిలావస్థకు చేరుకున్న భవనాల తొలగింపు చేపట్టకపోవడం, షాపులు కొందరు వ్యక్తుల ఆధీనంలో ఉండడంతో మున్సిపాలిటి ఆదాయానికి గండిపడుతుందని సభ్యులు అధికారులను నిలదీశారు. కమిషనర్ మాట్లాడుతూ, ఈ విషయాల్లో ఏమైనా న్యా యపరమైన అంశాలను పరిశీలించి వచ్చే సర్వసభ్య సమావేశానికి సభ్యులు ఆమోదం కొరకు తీర్మానం ప్రవేశపెడతామన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఐదు అంగన్‌వాడీ పోస్టులతో పాటు ఓ మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు అర్హులైన ఎస్టీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ ఎస్.ఈశ్వరమ్మ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. పుట్టజమ్ము, తాడికొండ, కోసంగిభద్ర, టెంకసింగి, గోరటి గ్రామాల్లో అంగన్‌వాడీ ఆయా పోస్టులు, కొండ బిన్నిడి గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉండి, వివాహిత మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. 2023 జనవరి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.
కురుపాం/జియ్యమ్మవలస: కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ కె.విజయగౌరి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. కురుపాం మండలంలోని దొమ్మిడి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త(ఎస్టీ), గుమ్మిడిగూడ గ్రామంలో సహాయకులు (ఎస్టీ), జియ్యమ్మవలస మండలంలోని కుందర తిరువాడ(ఎస్టీ), వెంకటరాజపురం(ఓసీ-ఈడబ్ల్యూసీ), బిత్తరపాడు(బీసీ-ఇ), పందులవానివలస(ఎస్సీ), తురకనాయుడువలస(ఓసీ) సహాయకుల పోస్టులకు ఈనెల 6వతేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.
సీతంపేట: స్థానిక ఐసీడీఎస్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ పి.రంగలక్ష్మి ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. రాజుగాడిగూడ, గురండి, నడిమిగూడలలో మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, తుంబకొండలో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారంతా ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఐటీడీఏ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. నిబంధనల ప్రకారం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, అయితే ఏజెన్సీ కావున 8 లేదా 9వ తరగతి ఉత్తీర్ణులైతే సరిపోతుందన్నారు.

మహిళకు గాయాలు

సాలూరు: మండలంలో పట్టుచెన్నేరు ఘాట్‌రోడ్డు వద్ద ఆటో ఢీకొని మహిళకు శనివారం గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... మారికచింతలవలస నుంచి వస్తున్న డొంకలవెలగవలసకు చెందిన జూలి పట్టుచెన్నేరు ఘాట్‌రోడ్డు వద్ద ఓ ప్రాంతంలో ఆగారు. రోడ్డు దాటుతున్న జూలిని, ఘాట్ రోడ్డు నుంచి కిందకు వస్తున్న ఆటో ఢీకొట్టి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో జూలి, ఆటో డ్రైవర్ తిరుపతిరావుకు గాయాలయ్యాయి.దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సకాలంలో రేషన్ సరుకుల పంపిణీ : డీఆర్‌ఓ

సీతానగరం: వినియోగదారులకు రేషన్ డిపోల ద్వారా ప్రతి నెలా పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు నిర్దేశించిన గడువులోగా డీలర్లు పంపిణీ చేయాలని డీఆర్‌ఓ జె.వెంకటరావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, పెదబోగిలి రేషన్ డిపోలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ డిపోల్లో ఉన్న సరుకు నిల్వలు(స్టాక్ బోర్డులు) పంపిణీ చేసిన సరుకుల వివరాలను సేకరించారు. అనంతరం తూనిక మిషన్లను పరిశీలించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో రేషన్ డిపోలను ఆకస్మిక తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. సీఎస్‌డీటీ రమేష్‌బాబు, రేషన్ వినియోగదారులు, డీలర్లు పాల్గొన్నారు.



రేషన్ వినియోదారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ వెంకటరావు

ఐటీఐ విద్యార్థులకు పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు

సీతంపేట: ఐటీఐ విద్యార్థులకు పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారంతా ప్రవేశ పరీక్ష రాసి, పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో జాయిన్ కావచ్చన్నారు. జనవరి 9 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆసక్తి ఉన్న అభ్యర్థులకు బ్రిడ్జి కోర్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సీతంపేట ప్రభుత్వ ఐటీఐను గానీ ఫోన్ నంబర్ 9948582309ను గానీ సంప్రదించాలని ఆయన కోరారు.

ట్యాబ్ టీచింగ్



విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక విద్యను దగ్గర చేయాలన్న ప్రధాన ఉద్దేశ్యంతో ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లతో సీతంపేట గిరిజన ఆశ్రమ బాలికోన్నత బోధన ఆరంభమైంది. ప్రధానోపాధ్యాయురాలు ఎ.లిల్లీరాణి ఆధ్వర్యంలో శనివారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు సిబ్బంది ఇలా ట్యాబ్‌ల ఆధారంగా విద్యాబోధన చేశారు.

– సీతంపేట

యాప్‌లో విద్యార్థుల హాజరు



సూచనలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

భామిని: ప్రభుత్వం రూపొందించిన యాప్‌లలో విధిగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వివరాలు నమోదు చేయాలని ఎంఈఓ శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన ఆయన విద్యాబోధన పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లతో బోధన ఆరంభించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు కిశోర్ కుమార్, చిన్నబాబు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



వీరఘట్టం: నూతన సంవత్సరం–2023 పురస్కరించుకుని, పాలకొండ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పండగ చేసుకోవాలన్నారు. బంధువులు, స్నేహితులతో ఎక్కడ సంబరాలు చేసుకున్నా సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

కుమ్మరిగుంటలో గజరాజులు

కొమరాడ: మండల ప్రజలకు గజరాజుల బాధలు వీడడం లేదు. రెండు వారాలుగా అర్థం రిజర్వు ఫారెస్టును ఆనుకొని ఉన్న కుమ్మరిగుంట రహదారిపై గజరాజులు తిష్ట వేశాయి. దీంతో కుమ్మరిగుంట, రాజ్యలక్ష్మీపురం ప్రజలు రాత్రి పూట ఆందోళన చెందుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా బయటకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో టమాట, జామ, బొప్పాయి వంటి వాణిజ్య పంటలను ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ

కొమరాడ: మండలంలోని విక్రంపురం గ్రామ సచివాలయంలో సోమలింగాపురం రైతులకు శనివారం భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. భూముల రీసర్వే అనంతరం సంబంధిత రైతులకు ఈ భూ హక్కు పత్రాలు అందిస్తున్నట్లు మాజీ డీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు కళింగి మల్లీశ్వరావు తెలిపారు.